సాక్షి సంగారెడ్డి

సోమవారం । 28 । జూలై । 2025





మారథాన్‌లో పాల్గొన్న రన్నర్స్, యువత

ఉరకలెత్తిన ఉత్సాహం

ఉల్లాసంగా హాఫ్ మారథాన్ • రంగనాయక సాగర్ జనసంద్రం

రంగనాయక సాగర్ కట్టపై నిర్వహించిన మారథాన్‌లో బాలికల కేరింతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): హాఫ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్ట జనసంద్రంగా మారింది. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఇందుకు సపోర్టింగ్ స్పాన్సర్‌గా సాక్షి మీడియా వ్యవహరించింది. 5, 10, 21 కి.మీ. విభాగాల్లో నిర్వహించిన పరుగు పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన వారు ఆసక్తిగా పాల్గొన్నారు. రన్నర్స్, యువత, ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా పరిగెత్తారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జెండా ఊపి పరుగును ప్రారంభించారు. ఈ పరుగులో గెలుపొందిన విజేతలకు నగదు పురస్కారాలను అందజేశారు.

సాక్షి డాట్ గేమ్స్ అదుర్స్..

రంగనాయక సాగర్‌పై జరిగిన హాఫ్ మారథాన్‌లో సాక్షి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాక్షి డాట్ గేమ్స్ ఆకట్టుకున్నాయి. రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్కడే ఏర్పాటు చేసిన సాక్షి విత్ సెల్ఫీ పాయింట్‌లో ఫొటోలు దిగారు. సాక్షి డాట్ గేమ్‌లో మొదటి ముగ్గురి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీ రఘునందన్‌రావుతో పాటు సినీ నటుడు సంపూర్ణేష్ బాబు, పలువురు ప్రముఖులు, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు తదితరులు సాక్షి సెల్ఫీ పాయింట్‌లో ఫొటోలు దిగారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరి..



డయాబెటిక్ ఇండియాను హెల్త్ ఇండియాగా మార్చాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ప్రస్తుతం మనల్ని మనం రక్షించుకోవడానికి మన ముందున్న మార్గం వాకింగ్ అన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే దేశం బాగుంటుందన్నారు. ఆరోగ్యవంతంగా ఉంటేనే ఏ రంగంలోనైనా రాణించగలమన్నారు.

50 మారథాన్‌లలో పాల్గొన్నా



ఇప్పటి వరకు 50 మారథాన్‌లలో పాలొని సత్తాచాటాను. ఢిల్లీ, ముంబై, చెన్నై, గుజరాత్, వైజాగ్, హైదరాబాద్‌లలో జరిగిన మారథాన్‌లలో పాల్గొన్నా. గత ఏడాది సిద్దిపేటో మొదటి స్థానంలో నిలిచాను. ఈ సారి 21కే లో రెండో స్థానం సాధించాను.

– రమేశ్ చంద్ర, నాగర్‌కర్నూల్



ఉత్సాహంగా 'సాక్షి' డాట్ గేమ్స్

ఆరోగ్యమే మహా భాగ్యం



ఆరోగ్యమే మహా భాగ్యమని, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని సినీ నటుడు సంపూర్ణేష్ బాబు అన్నారు. యువత డ్రగ్స్, బెట్టింగ్ బారిన పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. యువత బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కావద్దన్నారు.

న్యూస్‌రీల్

వన దుర్గమ్మా.. కరుణించమ్మా



పాపన్నపేట(మెదక్): వన దుర్గమ్మా.. మము బ్రోవమ్మా అంటూ వేలాది మంది భక్తులు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయం వద్ద రద్దీ నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం పోసి బోనాలు తీసి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రవి



పటాన్‌చెరు టౌన్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన రవి ఎన్నికయ్యారు. ఈ మేరకు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన నాయకులందరికీ రవి కృతజ్ఞతలు తెలిపారు. వీహెచ్‌పీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

మోదీ విధానాలపై పోరాడాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని టీఎన్‌జీఓ భవన్‌లో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగవ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులకు మద్దతుగా లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు నిరంతరం పోరాడతామన్నారు. కార్మికులు నిరంతరం పనిచేస్తున్న పని భద్రత ప్రదేశాల్లో భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం కార్మికుల దోపిడీకి పాల్పడుతుందని మండిపడ్డారు.

బీసీలకే 42% రిజర్వేషన్లు

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 42% రిజర్వేషన్లు బీసీలకే ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, పార్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అందులో ముస్లింలకు పది శాతం ఇవ్వడమేందుకని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్లలో ముస్లింలకు ఇస్తే బీసీలను మోసం చేయడమేనని వారన్నారు. 42% రిజర్వేషన్లను బీసీలకే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కాగా, మొదటగా రాష్ట్ర మంత్రి మండలిలో బీసీల సంఖ్యను పెంచాలని మురళీయాదవ్, రమేశ్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలు పెట్టనందున నిధులు రావడం లేదని, సీఎం పరోక్షంగా గ్రామాల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

ఖేడ్.. ఇక పాలన దౌడ్

- సబ్ కలెక్టర్ నియామకంతో మేలు
- క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం సులువు
- అధికారులు, ప్రజల మధ్య సమన్వయం
- ప్రజావాణి ఇక్కడే.. నేరుగా సమస్యపై ఫిర్యాదు
- నేడు సబ్ కలెక్టర్‌గా ఉమా హారతి బాధ్యతల స్వీకరణ



ఉమా హారతి, సబ్ కలెక్టర్, నారాయణఖేడ్

నారాయణఖేడ్: మారుమూల ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధి, క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రంలో పలు రెవెన్యూ డివిజన్లను సబ్ కలెక్టర్ కార్యాలయాలుగా మారుస్తూ సబ్ కలెక్టర్లను నియమించింది. అందులో భాగంగా జిల్లాలోని నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి 2023వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఉమా హారతిని కేటాయించారు. రాష్ట్రంలో భైంసాకు అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్మూర్‌కు అభిజ్ఞాన్ మాల్వియా, ఖమ్మం జిల్లా కల్లూరుకు అజయ్ యాదవ్, భద్రాచలానికి మృణాళ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా మనోజ్‌ను నియమించారు. ఖేడ్‌కు కేటాయించిన సబ్ కలెక్టర్ ఉమా హారతి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఖేడ్‌కు పూర్వ వైభవం!

ఖేడ్ నియోజకవర్గం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజనకు ముందు కర్ణాటకలో, నిజాం పాలన కింద కొనసాగింది. నాడే డివిజన్ కేంద్రంగా కొనసాగిన ఖేడ్ వికారాబాద్‌పాయగా సాగింది. అప్పట్లో పన్నులను వసూలు చేసి వికారాబాద్‌కు పన్నులు చెల్లింపులు జరిపేది. బీదర్ జిల్లాతో సత్సంబంధాలు కొనసాగేవి. అప్పట్లో వస్తువుల క్రయ, విక్రయాలు, బంధుత్వాలు చాలావరకు కర్ణాటకతో ముడిపడి ఉన్నాయి. కర్ణాటక, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండటంతో సరిహద్దు గ్రామాలతోపాటు మెజార్టీ మండలాల్లో కన్నడ, మరాఠీ భాషలను మాతృభాష తరహాలోనే మాట్లాడతారు. ఉమ్మడి రాష్ట్రాల పునర్విభజనతో ఆంధ్రప్రదేశ్‌లో కలిశాక ఖేడ్ నియోజకవర్గ కేంద్రానికి పరిమితమైంది.



సబ్ కలెక్టర్ కార్యాలయం

2016లో రెవెన్యూ డివిజన్‌గా..

ఖేడ్‌లో ఉప ఎన్నికల సందర్భంగా నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాంత ప్రజలు, విద్యార్థుల కోరిక మేరకు 11 అక్టోబర్ 2016న ఖేడ్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసింది. అప్పటినుంచి పరిపాలన కొనాసాగుతుంది. అంతకుముందు సంగారెడ్డి ఆర్డీఓ పరిధిలో ఉండటంతో ఏ చిన్న పనికైనా జిల్లా కేంద్రం సంగారెడ్డి వెళ్లాల్సి వచ్చేది. ఇక్కడే ఆర్డీఓ ఉండటంతో చాలా పనులు చేసుకోవడం, డివిజన్ స్థాయి అధికారి ఉండటంతో తనిఖీలు, ప్రజా సమస్యలు కొంత పరిష్కారం అయ్యేవి.

సబ్ కల్టెర్ హోదాతో..

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్న ఖేడ్‌లో సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి ఉండటంతో ప్రజా సమస్యలు తక్షణం పరిష్కారం కాగలవు. జిల్లా కేంద్రానికి ఖేడ్ 85కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రజావాణి, ఇతర సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతూ వెళ్తుంటారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు జిల్లా కేంద్రానికి ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చేది. ప్రజావాణితో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు, ఆయా విభాగాల సమస్యలన్నింటినీ సబ్ కలెక్టర్ హోదాలో అధికారి ఇక్కడే పరిష్కరించే వీలుంది. ఏ సమస్యనైనా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వీలు సబ్ కలెక్టర్‌కు కలుగనుంది. దీంతో ప్రజలు నేరుగా సమస్యలు వివరించి పరిష్కరించుకునే అవకాశం కలిగింది. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయం ఖేడ్ ప్రజలకు వరంలా మారనుంది. ఆరు మండలాలతో ఖేడ్ డివిజన్ కొనసాగుతుంది. అన్ని మండలాల ప్రజానీకం, ప్రజాప్రతినిధులు, అధికారులకు సబ్ కలెక్టర్ అనుసంధాన కర్తగా ఆయా విభాగాలకు పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు.

ప్రశాంతంగా జీపీఓ, సర్వేయర్ల పరీక్ష

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య



పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో అదనపు కలెక్టరు మాధురి

సంగారెడ్డి జోన్: గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం కోసం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పి.ప్రావీణ్య, అధికారులతో కలిసి పరిశీలించారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 77 మంది అభ్యర్థులకు గాను 62 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరయ్యారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు160 మంది అభ్యర్థులకు గాను 129 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం సర్వేయర్ల అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ పద్మజా రాణి, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, సహాయ సంచాలకులు సర్వే ల్యాండ్ రికార్డు అధికారి ఐనేష్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెంట్, అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలులో పూర్తిగా విఫలమైందని, వాటిని చిత్తశుద్ధితో నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడివయ్య డిమాండ్ చేశారు. మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం పార్టీ జిల్లాస్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మికుల పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆగష్టు, సెప్టెంబర్ నెలలో ప్రజల సమస్యలపై గ్రామాలు, పట్టణాల్లో సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెదక్‌లో ఆగష్టు 4 నుంచి 13 వరకు సర్వేలు నిర్వహిస్తామని చెప్పారు. సర్వేలలో వచ్చిన సమస్యలపై ఎంపీడీఓ కార్యాలయాల ముందు ధర్నాలు చేపడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే కుట్రలు చేస్తుందని వెంటనే అటువంటి ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నల్లవాగు అభివృద్ధి కోసం చర్యలు

ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి



నల్లవాగు గురుకులంలో భోజన వసతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్)/కంగ్టి(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. నల్లవాగు ప్రాజెక్టును ఆదివారం ఆయన సందర్శించారు. వానాకాలం పంటల సాగుకోసం ప్రాజెక్టులో నీటినిల్వ పరిశీలించారు. ప్రాజెక్టు కట్టపై చెట్లు తొలగించాలని అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న నీటి ఆధారంగా పంటల సాగుకోసం రైతులతో చర్చించారు. అనంతరం నల్లవాగు గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. భోజన వసతి, విద్యాబోధన గురించి విద్యార్థులను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంగ్టి మండలంలోని తడ్కల్ ప్రాథమిక పాఠశాల భవనంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేదలకు ఉచిత కంటి పరీక్షలు, వైద్య సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఏఈ శివదయాళ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపతయ్య, నాయకులు రమేశ్ చౌహాన్, యాదవరెడ్డి, తుకారాం, జితేందర్ రెడ్డి, జయరాజ్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్/పటాన్‌చెరు టౌన్: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు పేర్కొన్నారు. సమాజంలో దోపిడీ అణచివేత పోవాలన్నా, సమ సమాజం రావాలన్నా అది కేవలం మార్క్సిస్ట్ సిద్ధాంతం ద్వారానే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశంతోపాటు పటాన్‌చెరు పట్టణంలోని ఐలా భవన్‌లో జరిగిన కిర్బీ కార్మికుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచమంతా శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతుంటే మన దేశంలో మాత్రం మూఢాచారాల కు పెద్దపీట వేస్తూ బీజేపీ పాలన చేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కులాలు, మతాల పేరిట విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

యూరియా ఉందయా..

- ప్రస్తుతం 3,900 ఎంటీఎస్‌ల నిల్వలు
- మరో 11,700 ఎంటీఎస్ అవసరం
- వదంతులు నమ్మొద్దంటున్న అధికారులు



మెదక్‌జోన్: రాష్ట్రంలోని అనేక జిల్లాలో యూరియా కోసం షాపుల ముందు క్యూలైన్లు కడుతున్నారు. ఆధార్‌కార్డులు, భూమి పట్టాపాస్ పుస్తకాలు పట్టుకుని వెళ్తున్నారు. కానీ మెతుకు సీమలో మాత్రం ఇప్పటి వరకు అలాంటి పరిస్థితి ఎక్కడాలేదు. యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి సాగు 3.05 లక్షల ఎకరాల్లో సాగవుతుండగా మిగతా 45 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు కానున్నాయి. కాగా, ఇప్పటివరకు జిల్లాలో అన్నిరకాల పంటలు 1,38,783 ఎకరాల్లో సాగయ్యాయి. వాటిలో పత్తి సాగు 35వేల ఎకరాలు సాగు కాగా మొక్కజొన్న 2,500 కందులు 1,500 ఎకరాలతో పాటు కూరగాయలు, జొన్నలు, రాగులు ఇతర పంటలు మరో 6 వేల ఎకరాల్లో సాగయ్యాయి. మిగతా 93,783 ఎకరాల్లో వరి సాగైంది. కాగా, అన్ని రకాల పంటలకు కలిసి యూ రియా సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.


3,900 ఎంటీఎస్ నిల్వలు

ఇప్పటికే జిల్లాలో 1.38 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇందుకోసం ఇప్పటికే సుమారు 10 వేల మెట్రిక్‌టన్నుల (ఎంటీఎస్) యూరియాను రైతులు వినియోగించి ఉంటారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 37 పీఏసీఎస్‌లలో 1,400 ఎంటీఎస్ నిల్వలు ఉండగా ప్రైవేట్ డీలర్స్ వద్ద 905 ఎంటీఎస్, మార్క్‌ఫెడ్‌శాఖ అధీనంలో 1,595 ఎంటీఎస్ యూరియా నిల్వలున్నాయి. ఇంకా జిల్లాకు 11,700 ఎంటీఎస్‌ల యూరియా అవసరం ఉంటుందని, విడతల వారీగా అవసరం మేరకు తెప్పిస్తామని సంబంధిత ఉన్నతాధికారులు చెబుతున్నారు.

అవసరం ఇలా...

కాగా యూరియా ఎకరం వరికి 2–3 బస్తాలు అవసరం ఉంటుంది. అలాగే మొక్కజొన్నకు, 3 బస్తాలు, కూరగాయలకు, పత్తికి మాత్రం 2 బస్తాల చొప్పున అవసరం అవుతుంది. ఇందులో వరికి రెండు సార్లు చల్లుతారు. నాట్లు వేసిన 15–20 రోజుల వ్యవధిలో ఒక్కసారి చల్లాలి. పొలంలో కలుపు తీశాక 45 రోజుల వ్యవధిలో మరోసారి చల్లాల్సి ఉంటుంది. అలాగే మొక్కజొన్న కాస్త పెరిగాక ఒక్కసారి అనంతరం గింజదశలో మరోసారి వేయాల్సి ఉంటుంది. కూరగాయలు, ఇతర పంటలకు సైతం రెండు సార్లు యూరియా వేయాల్సి ఉంటుంది. యూరియా వేస్తేనే పంట ఎదుగుదల ఉంటుంది. అందుకే యూరియాకు అంతటి ప్రత్యేకత ఉంటుంది.

వదంతులు నమ్మొద్దు



యూరియా కొరత ఉందని కొంత మంది పనికట్టుకుని చేసే వదంతుల్ని రైతులెవరూ నమ్మొద్దు. యూరియా అవసరమైతే పీఏసీఎస్‌లలో, ప్రైవేట్ డీలర్లవద్ద, మార్క్‌ఫెడ్‌లలో సరిపడా ఉంది తీసుకోవచ్చు. తప్పుడు మాటలు నమ్మి యూరియా దొరుకుతుందో లేదోనని అవసరం కన్నా ఎక్కువగా కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ ఉంచకండి. అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలి.

– దేవ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మెదక్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కాలేరాం తండాలో ఆదివారం చోటుచేసుకుంది. బీమ్లా తండాకు చెందిన కేతవాత్ రమేశ్ తన గేదెలను రోజువారీగా పొలం వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గేదె మేత మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. గేదె విలువ రూ.40 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్ : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాష్ వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి శివారు పాశమైలారం రోడ్డులో రేణుక ఎల్లమ్మ దేవస్థానం పక్కన హైటెన్షన్ స్తంభానికి కేబుల్ వైర్‌తో ఉరివేసుకొని కుళ్లిన స్థితిలో ఆదివారం వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్లు ఉంటాయని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తించడం కష్టంగా మారిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి చేతికి రాగి కడియం ఉంది.

వర్షానికి కూలిన ఇళ్లు..

చిన్నశంకరంపేట(మెదక్): వర్షాలతో పలువురి ఇళ్లు కూలిపోయాయి. మండల కేంద్రంలోని దప్పు లక్ష్మి నర్సింహులు ఇల్లు ఒకవైపు గోడ కూలిపోయింది. దీంతో పైకప్పు ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు.అలాగే రుద్రారం గ్రామంలో తొర్రి సత్తయ్య ఇల్లు కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్



పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఐదుగురు పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. హద్నూర్ ఎస్‌ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం ... ఖలీల్‌పూర్ గ్రామ శివారులో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి చెరకు తోటలో కొందరు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.17వేలు నగదు, పేకాట ముక్కలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుజిత్ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

గోవా మద్యం పట్టివేత

మునిపల్లి(అందోల్): నిబంధనలకు విరుద్ధంగా తీసుకువస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి కథనం ప్రకారం... ఆదివారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. గోవా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ట్రావెల్ బస్సులో తీసుకువస్తున్న 6.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అరెస్టు చేశారు.

గంజాయి స్వాధీనం..

గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా.. కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 1250 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. హైదరాబాద్ మూసాపేటకు చెందిన శ్రీధర్, దనుంజయా బెహర కర్నాటకలోని బీదర్‌లో ఇరాని గల్లీలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. వారి వద్ద నుంచి హోండా యాక్టీవా, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మందుబాబుల ఆగడాలు

- అడ్డాగా రామసముద్రం కట్ట
- స్టీల్ రెయిలింగ్ ధ్వంసం
- ఇబ్బందులు పడుతున్న వాకర్స్



మెట్లపై దర్శనమిస్తున్న బీర్ బాటిళ్లు

దుబ్బాకటౌన్: దుబ్బాక రామసముద్రం కట్ట మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రభుత్వం లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన ప్రదేశం తాగుబోతులకు నిలయం అవ్వడంతో వాకర్స్ భయాందోళనకు గురవుతున్నారు. వాకింగ్‌కు వెళ్లినప్పుడు మద్యం సీసాలు, పగలగొట్టిన గాజు పెంకులు దర్శనమిస్తున్నాయని వాపోయారు. పోలీసులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.

దుబ్బాక రామసముద్రం సుందరీకరణకు 2018లో రూ.3 కోట్ల నిధులతో ఒక కిలో మీటర్ వరకు కట్టపై వాకింగ్ ట్రాక్, సీసీ రోడ్డు, స్టీల్ రెయిలింగ్, తదితర పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం రూ. 50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో 2019లో పిల్లల పార్కును నిర్మించి పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులను సమకూర్చి సుందరంగా తయారు చేశారు. సాయంత్రం సమయంలో కట్టపై వాకర్స్ వాకింగ్ చేయడానికి వెళ్తే మందుబాబులు మద్యం సేవించడం వాకర్స్‌కు ఇబ్బందిగా మారింది. ఇక్కడ మద్యం ఎందుకు తాగుతున్నారని వాకర్స్ ప్రశ్నిస్తే మందుబాబులు దూషిస్తున్నారని వాపోతున్నారు.



కట్టపై ధ్వంసమైన స్టీల్ రెయిలింగ్

మద్యం సీసాలు పగలగొట్టి..

మందుబాబులు మద్యం తాగి వీరంగం సృష్టిస్తున్నారు. తాగిన సీసాలను పగలగొట్టడంతో కాళ్లకు గుచ్చుకుంటున్నాయని వాకర్స్ భయాందోళనకు గురవుతున్నారు. అంతటితో ఆగకుండా మందుబాబులు ఇటీవల స్టీల్ రెయిలింగ్‌ను ధ్వంసం చేశారు. గతంలో సైతం రామసముద్రం కట్టపై పిల్లలు ఆడుకునే ఆట వస్తువులను ధ్వంసం చేసి దొంగిలించారు. కాగా ధ్వంసమైన స్టీల్ రెయిలింగ్‌ను అధికారులు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉంచారు.

చర్యలు తప్పవు..



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. చెరువు కట్టలపై మద్యం తాగడం నిషేధం. మందుబాబులు ప్రజాధనానికి నష్టం చేకూర్చినా, ఎక్కడైనా వీరంగం సృష్టించినా ఉపేక్షించేది లేదు.

– కీర్తిరాజు, ఎస్‌ఐ, దుబ్బాక

మరమ్మతులు చేయిస్తాం



కట్టపై స్టీల్ రెయిలింగ్ ధ్వంసమైన విషయం వాస్తవమే. రెయిలింగ్‌ను అక్కడే ఉంచితే దొంగలు ఎత్తుకెళ్తారని కార్యాలయం ఆవరణలో ఉంచాం. కట్టపై పిచ్చి మొక్కల తొలగింపు, స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నాం. మద్యం తాగుతున్నారనే విషయం మా దృష్టికి సైతం వచ్చింది. ధ్వంసమైన స్టీల్ రెయిలింగ్‌ను త్వరలో మరమ్మతులు చేయిస్తాం.

– రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

కేంద్రం ఆధీనంలోనే ఎరువుల తయారీ

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్ర
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



అక్కన్నపేట: లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్ హైమావతి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎరువుల తయారీ.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, మిగితా విత్తనాలు నీళ్లు, విద్యుత్‌ను రాష్ట్రాలు ఇస్తాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి ఎరువులు ఎక్కడి నుంచి వస్తాయో తెలియదన్నారు. రాష్ట్రానికి ఎరువులు సరఫరా చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అధ్యక్షుడు మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలన్నారు. దమ్ముంటే ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రి దగ్గర కూర్చొని రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. పలు మార్లు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి సంబంధిత కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి పేర్కొన్నారు.

గ్రామాలను విలీనం చేసేందుకు ప్రయత్నం

మండలంలోని గోవర్ధనగిరి, రేగొండ గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేసేందుకు సీసీఎల్‌ఏలో ప్రయత్నిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రైతు వేదికలో రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రాంమ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలం పరిశీలన

కోహెడరూరల్(హుస్నాబాద్): యంగ్ ఇండియా స్కూల్‌తో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని తంగళ్లపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బస్వాపూర్, పోరెడ్డిపల్లెలో ఈత మొక్కలు నాటారు. ప్రభుత్వ స్థలాలు, చెక్‌డ్యాంలు, చెరువు కట్టల వద్ద మొక్కలు నాటాలన్నారు. మంత్రి వెంట కలెక్టర్ , అధికారులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

ప్రయాణికురాలికి పర్సు అప్పగింత



ప్రయాణికురాలికి పర్సును అందజేస్తున్న కండక్టర్

టేక్మాల్(మెదక్): విధి నిర్వహణలో ఆర్టీసీ బస్ కండక్టర్ ముదిగొండ రవి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు ఇలా... సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నారాయణఖేడ్ నుంచి లింగంపల్లి వైపు వెళుతుంది. శంకరంపేట్ బస్టాండ్‌లో బొడ్మట్‌పల్లి వెళ్లేందుకు ప్రయాణికురాలు బస్సు ఎక్కింది. తన స్టేజ్ రావడంతో దిగిన ఆమె పర్సును బస్సులో మర్చిపోయింది. గమనించిన కండక్టర్ రవి పర్సును తెరిచి చూశారు. అందులో వెండి ఉంగరంతో పాటూ రూ. 2050 నగదు ఉంది. వివరాల కోసం పర్సులో వెతకగా ప్రయాణికురాలి కొడుకు సర్దార్ ఫోన్ నంబర్ ఉండటంతో వారికి సమాచారం అందించారు. బొడ్మట్‌పల్లి స్టేజ్ వద్ద ప్రయాణికురాలు, ఆమె కొడుకుకు పర్సును అందజేశారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను ప్రయాణికులు, ఆర్టీసీ అధికారులు అభినందించారు.

వాగులో నవజాత శిశువు మృతదేహం

- ఎవరైనా వదేశారా? వాగులో కొట్టుకువచ్చిందా?
- కేశనాయక్‌తండాలో కలకలం

అక్కన్నపేట(హుస్నాబాద్): వాగులో నవజాత శిశువు మృతదేహం కలకలం రేపింది. ఈ ఘటన మండలంలోని కేశనాయక్‌తండా గ్రామ పరిధిలోని లచ్చానాయక్‌తండా పక్కనే ఉన్న వాగులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన ఓ రైతు వాగులో నవజాత శిశువు మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందజేశాడు. దీంతో హుటాహుటిన ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ ఘటనా స్థలానికి చేరుకుని వైద్యులను రప్పించారు. దీంతో మృతి చెందిన శిశువును పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అయితే, వాగులో నవజాత శిశువు కొట్టుకు వచ్చిందా? లేక చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఎవరైనా బిడ్డ జన్మించిన తర్వాత వాగులో పడేసిపోయారా?అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాకేశ్ కుమార్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్ చెరు): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తెల్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. వైఎస్ఆర్ జిల్లాకు చెందిన రాకేశ్ కుమార్ రెడ్డి(24) జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చాడు. తెల్లాపూర్‌లో యానిమల్ కేర్ సెంటర్‌ను నిర్వహిస్తున్న గోపన్‌పల్లికి చెందిన సంధ్యారాణి వద్ద నాలుగు ఏళ్లుగా యానిమల్ కేర్ టేకర్‌గా రాకేశ్ కుమార్ రెడ్డి పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసైన అతడు తన యాజమాని సంధ్యారాణి వద్ద సుమారు రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. ఈ విషయాన్ని కొద్ది రోజుల క్రితం ఆమె రాకేశ్ కుటుంబ సభ్యులకు తెలియజేసింది. కాగా శనివారం రాత్రి తనకు కొంత అప్పు కావాలని యజమానిని అడిగాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య స్వల్పంగా మాటామాట పెరిగింది. ఆగ్రహంతో రాకేశ్ కుమార్ రెడ్డి కర్ర తీసుకుని సంధ్యారాణిపై దాడి చేశాడు. ఆమె తలకు గాయం కావడంతో వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి రాగా అప్పటికే అతడు పరారయ్యాడు. ఆదివారం ఉదయం తెల్లాపూర్ చెరువు వద్ద ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి చేరుకున్నారు. చెట్టుకు ఉరివేసుకున్నది రాకేశ్ కుమార్ రెడ్డి అని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోపడి యూపీ వాసి..

హవేళిఘణాపూర్(మెదక్): ఓ వ్యక్తి కాలువలో పడి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మెదక్ మండల పరిధిలోని మాచవరం శివారులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా... ఉత్తరప్రదేశ్ సియో జిల్లా ఇంద్రాయికి చెందిన రాజేశంపాండే(34) మాచవరం గ్రామ శివారులో కూలీ పని నిమిత్తం వచ్చాడు. శుక్రవారం సాయంత్రం అతడు పక్కనే ఉన్న ఎంఎన్ కెనాల్ కాలువ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి కాలు జారి పడ్డాడు. దీంతో తోటి కూలీలు వెతికినా అతడు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంఎన్ కెనాల్ కాలువ ఉధృతి ఎక్కువగా ఉండటంతో మెదక్ రూరల్ ఎస్‌ఐ మురళి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని నిలిపివేయించారు. కాగా ఆదివారం ఉదయం కాలువలో రాజేశంపాండే మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

చేర్యాల(సిద్దిపేట): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగపురి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సాంబని కనకయ్య అదే గ్రామంలో ఓ భూ వివాదానికి సంబంధించి గతంలో జరిగిన గొడవ ఫొటోలను వాట్సాప్ గ్రూపులో పోస్ట్‌చేశాడు. విషయమై ఫొటోల్లో ఉన్న వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం కొమురవెల్లి పోలీసులు స్టేషన్‌కు పిలిపించి మందలించి పంపించారు. ఆదివారం ఉదయం కనకయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ రాజుగౌడ్‌తో మాట్లాడగా అతడిపై వచ్చిన ఫిర్యాదు మేరకు పిలిచి మాట్లాడి పంపించామని తెలిపాడు.

మంజీరా నదిలో యువకుడి గల్లంతు



శాయిబాజ్

పాపన్నపేట(మెదక్): మంజీరా నదిలో యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని ముద్దాపూర్ బ్రిడ్జి వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ తుక్కయ్య కథనం మేరకు... మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన శాయిబాజ్ (25) మెదక్‌లోని ఆర్‌టీఏ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఆరుగురు స్నేహితులతో కలిసి ముద్దాపూర్ బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. అక్కడ చేపలు పట్టే క్రమంలో మంజీరా ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటిలో కొట్టుకుపోయాడు. కాగా సాయంత్రం వరకు అతని ఆచూకీ దొరక లేదు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

రామాయంపేట(మెదక్): వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన రామాయంపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... పట్టణానికి చెందిన చాకలి సుజాత ఈనెల 25న ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె సెల్‌ఫోన్ సైతం ఇంటి వద్దే వదిలి వెళ్లింది. ఈ మేరకు సుజాత కూతురు దుర్గాభవాని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాక్సిన్లు అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్



బస్తీ దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

సిద్దిపేటకమాన్ : కుక్క, పాము కాటు సంబంధిత వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ధనరాజ్ తెలిపారు. సిద్దిపేట కాలకుంట కాలనీలోని బస్తీ దవాఖానను డీఎంహెచ్ఓ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బస్తీ దవాఖానలో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. హై రిస్క్ ఉన్న గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



సీఐటీయూలో చేరుతున్న కార్మికులు

దుబ్బాకటౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శానిటేషన్, కేర్ టేకర్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులు ఆదివారం ఆయన సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు పూర్తి స్థాయి వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్లు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాల నుంచి కాకుండా ప్రభుత్వమే నేరుగా పీఎఫ్‌ను జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ. 26 వేల కనీస వేతనం అందజేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నామని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ తెలిపారు. అధ్యక్షురాలిగా లావణ్య, కార్యదర్శిగా ఇందిర, కోశాధికారిగా మహిపాల్, ఉపాధ్యక్షులుగా నవీన్ కుమార్, బాలాలక్ష్మిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ భాస్కర్, నాయకులు రాజు, ఎండీ. సాజిత్ కార్మికులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన క్రేన్ వాహనం

వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం మల్లుపల్లికి చెందిన సయ్యద్ చాన్‌పాష స్టోన్ కట్టింగ్ పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం స్టోన్ కటింగ్ బ్లేడ్‌ను తీసుకువచ్చేందుకు మల్లుపల్లి నుంచి గజ్వేల్‌కు ద్విచక్ర వాహనంపై ఇదే గ్రామానికి చెందిన బానోత్ చందుతో కలిసి వచ్చాడు. తిరిగి బైక్‌పై వెళ్తుండగా మండల పరిధిలోని జాలిగామ గ్రామ శివారులో వెనుక నుంచి వచ్చిన క్రేన్ వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రామాయంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో చాన్‌పాష మృతి చెందాడు. చాన్‌పాష మృతికి కారణమైన క్రేన్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ పైనుంచి పడి యువకుడు..



కిషోర్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడిన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన పోతరాజ్ కిషోర్‌కుమార్(35) ఈ నెల 15న మండల కేంద్రంలోని ప్యూయల్ స్టేషన్‌లో బైక్‌లో పెట్రోల్ పోసుకుని వెళుతుండగా అకస్మాత్తుగా కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య నవనీత, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కర్ణాటకకు 42 బోగీల బియ్యం రవాణా



లారీలో తెచ్చిన బియ్యం బస్తాలను బోగీలో లోడింగ్ చేయిస్తున్న అధికారులు

సిద్దిపేటఅర్బన్: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలను సైతం లెక్కచేయకుండా సిద్దిపేట నుంచి కర్ణాటకకు 42 రైలు బోగీల నిండా బియ్యాన్ని రవాణా చేసినట్టు ఎఫ్‌సీఐ అధికారులు తెలిపారు. సిద్దిపేటలోని గూడ్స్ రైల్వే షెడ్ నుంచి కర్ణాటకలోని కొప్పల్ ఎఫ్‌సీఐ ఫుడ్ స్టోరేజీ డిపోకు ఫోర్టిఫైడ్ రైస్ కర్నల్స్‌తో కూడిన రైలును విజయవంతంగా రవాణా చేయడం పట్ల అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. హబ్సీపూర్‌లోని ఎస్‌డబ్ల్యూసీ గోదాం నుంచి 90కి పైగా ట్రక్కుల ద్వారా రైల్వే లోడింగ్ పాయింట్‌కు తరలించగా 200 మంది కూలీలు బోగీలలో లోడింగ్ చేసినట్టు పేర్కొన్నారు. వర్షం వల్ల బస్తాలు తడిసిపోకుండా ఉండేందుకు కాంట్రాక్టర్ పాలిథిన్ షీట్ వేసి జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. వరి దిగుబడి ఎక్కువగా ఉన్న తెలంగాణ నుంచి తక్కువ ఉత్పత్తి కలిగిన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఝార్ఖండ్, బీహార్ వంటి రాష్ట్రాలకు తరలించినట్టు పేర్కొన్నారు.

చిత్రాలే.. పాఠాలై..

- ఆయా పాఠశాలల్లో గోడలపై బొమ్మలు
- సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా..


విద్యార్థులకు గోడలపై వేసిన చిత్రాలే పాఠాలు అవుతున్నాయి. ఉపాధ్యాయులు బోధించడం కన్నా.. చూసి నేర్చుకోవడం పిల్లలకు సులువు అవుతుంది. పిల్లలకు అర్థమయ్యే విధంగా మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదుల గోడలపై చిత్రాలు వేయించారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్)



రాయవరం పాఠశాలలో తరగతి గోడలపై బొమ్మలు

జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 28 ప్రాథమిక పాఠశాలలు, 10 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో మొత్తం 2380 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీ నిధుల ద్వారా పలు పాఠశాలల్లో మరమ్మతు పనులు చేయించారు. అందులో భాగంగా మండలంలోని కొన్ని పాఠశాలల్లో తరగతి గదుల గోడలకు పాఠాల చిత్రాలు వేయించారు. తిగుల్, ఇటిక్యాల, రాయవరం, జగదేవ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి పిల్లలతో పాటు అన్ని తరగతుల పిల్లలకు అర్థమయ్యేలా చిత్రాలు వేయించారు. అన్ని సబ్జెక్టులతో కూడిన బొమ్మలు వేశారు. జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, గణితశాస్త్రంతో పాటు జనరల్ చిత్రాలు కూడా వేశారు. భారతదేశం, తెలంగాణ చిత్రపటం, జాతీయ, రాష్ట్ర పక్షులు, అడవి జంతువులు, పిల్లలు ఆటలాడే చిత్రాలు వేయించారు. పుస్తకాల కంటే పిల్లలకు గోడలపై వేసిన బొమ్మలే సులువుగా అర్థమవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ప్రారంభిస్తామని చెప్పడంతో వాటికి అనుకూలంగా ఉంటాయని భావిస్తున్నారు.





తిగుల్ పాఠశాలలో తరగతి గోడలపై వేసిన చిత్రాలు

పిల్లలకు అర్థమయ్యేలా..

అమ్మ ఆదర్శ కార్యక్రమంలో పాఠశాలలో వసతులు కల్పించారు. అందులో భాగంగా తరగతి గోడలపై బొమ్మలు వేయించాం. చిన్న పిల్లలు బొమ్మలను చూసి పాఠాలు నేర్చుకుంటున్నారు. అలాగే జనరల్ నాలెడ్జ్‌కు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– శంకర్, ప్రధానోపాధ్యాయుడు, ఇటిక్యాల